క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. లష్కర్ సింగారం ప్రాంతంలో మధ్యాహ్నం 1 నుంచి 2గంటల వరకు, ముచ్చర్ల క్రాస్, ఆర్‌కే హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 2.30గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రైల్వే పాలి క్లినిక్‌లో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

కాజీపేట రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే పాలి క్లినిక్‌లో ఈనెల 6వ తేదీన కాజీపేట రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాజీపేట రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సంగమయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ హెప్జిబాకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండలోని ప్రభుత్వ మహిళా పింగిళి కళాశాల ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హెప్జిబాకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. దళిత్ ఫెమినిజం భామా, శివకామి రచనల అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి హెప్జిబాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కేయూ ఇంగ్లిష్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో హెప్జిబా తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



కాళోజీ సెంటర్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)స్కాలర్‌షిప్‌నకు తమ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కె.అరుణ తెలిపారు. వారికి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

స్వయంపాలన దినోత్సవం



మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులై తోటి స్నేహితులకు పాఠ్యాంశాలు బోధించారు. హెడ్ మాస్టర్ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, లీలారాణి, లక్ష్మి, అరుణ, శంషొద్దీన్, స్వర్ణలత పాల్గొన్నారు.

లైన్‌మెన్లదే ముఖ్య భూమిక



వరంగల్: వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడంలో లైన్‌మెన్లదే ముఖ్య భూమిక అని వరంగల్ సబ్ డివిజన్ డీఈఈ మల్లికార్జున్ అన్నారు. లైన్‌మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ ఏజేమిల్ సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎం, ఎల్ఐ, ఎస్ఎల్ఐ, ఎఫ్ఎం, అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్లను మంగళవారం సన్మానించారు.ఏడీఈ కిషోర్, ఏఈలు సాయికృష్ణ, దిలీప్, రజనీరెడ్డి, రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు పుట్టినరోజు వేడుకలు



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగుల మధ్య ఎమ్మెల్యే తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

వసూల్ రాజా!

- డబ్బులు ఇస్తేనే పశువులకు వైద్యం
- సర్కారు మందులు బ్లాక్ మార్కెట్లోకి..
- హసన్‌పర్తి పశువైద్యశాలలో రాజ్యమేలుతున్న అవినీతి
- వైద్యుడి తీరుపై ప్రజల ఆగ్రహం



హసన్‌పర్తిలోని పశువైద్యశాల

హసన్‌పర్తి: నగర శివారులోని పశువుల ఆస్పత్రిలో ఓ అధికారి వసూళ్లకు పాల్పడుతున్నాడు. డబ్బులు ఇవ్వకుంటే చికిత్సకు నిరాకరిస్తున్నాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పశువులకు చిన్న రోగం నుంచి డెలివరీ చేసే వరకు ఆ అధికారికి లంచం ఇవ్వాల్సిందే. హసన్‌పర్తి మండలంలో పరిధిలోని హసన్‌పర్తి, సిద్దాపురం ప్రాంతాల్లో రెండు పశువుల ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రి ప్రాంతంలో మూడు చొప్పున సబ్ సెంటర్లు ఉన్నాయి. హసన్‌పర్తి పరిధిలో దేవన్నపేట, చింతగట్టు, ఎల్లాపురం, సిద్దాపురం ప్రాంతాల్లో వంగపహాడ్, పెగడపల్లి, ముచ్చర్లల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి.

డబ్బులు ఇస్తేనే వైద్యం

మండలంలోని ఓ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు అవినీతికి పాల్పడుతున్నట్లు రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పశువుకు డెలివరీ చేయాలంటే కనీసం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు లంచం అడుగుతున్నాడని, లేకుంటే చికిత్సకు నిరాకరిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న రోగానికి కూడా సదరు డాక్టర్ లంచం తీసుకోకుండా వదలిపెట్టడం లేదని అంటున్నారు. పశువుకు చిన్న రోగానికి చికిత్స చేస్తే రూ.వేయి నుంచి రూ.1500లు ముట్టజెప్పాల్సిందేనని రైతులు వాపోతున్నారు. నగదులు లేకుంటే ఆ డాక్టర్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు బదిలీ చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.



ఫోన్‌పే ద్వారా బదిలీ అయిన డబ్బులు

సర్కారు మందులు బ్లాక్ మార్కెట్‌లోకి..

ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని రైతులు అంటున్నారు. పశువులకు చికిత్స నిర్వహించిన తర్వాత కనీసం మందులు ఇచ్చే దాఖలాలు లేవని చెబుతున్నారు. వచ్చిన మందులు బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్తున్నాయని, పశువులకు సంబంధించిన దాణా కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలుకు చీటి రాసి ఇస్తున్నాడని పలువురు రైతులు చెబుతున్నారు.

డెయిరీల నుంచి మామూళ్లు

హసన్‌పర్తి మండలంలో రైతు ఉత్పత్తి కేంద్రం ఆధ్వర్యంలో ఓ డెయిరీ నిర్వహిస్తున్నారు. అక్కడ సుమారు 44 పశువులు ఉన్నాయి. ప్రతినెలా మామూళ్లు ఇవ్వాలని సదరు వైద్యుడు డిమాండ్ చేస్తున్నాడని డెయిరీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే డెయిరీల్లో పశువులకు వైద్య సేవలు నిలిపివేస్తున్నాడని అంటున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

రైతులను పశు వైద్యాధికారి ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. లంచం వసూలు చేస్తున్నట్లు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి. కొంతకాలంగా ఆ వైద్యాధికారిపై ఆరోపణలు వస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఈ విషయపై జిల్లా ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తాం.

– రాంచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఆరోపణల్లో నిజం లేదు

రైతులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. ప్రజలు సమాచారం ఇస్తే అక్కడికి వెళ్లి పశువులకు వైద్యం చేసున్నా. ఎవరి నుంచీ డబ్బులు తీసుకోలేదు.

– క్రాంతికుమార్, పశువు వైద్యాధికారి

సమానత్వంతోనే సమాజ పురోగతి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



హన్మకొండ అర్బన్: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కేయూ క్యాంపస్: సమాజంలో పురుషులు, మహిళల సమానత్వంతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఆడిటోరియంలో యాక్సిలరేట్ యాక్షన్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో బాలబాలికల నిష్పత్తితోపాటు విద్యలోను వ్యత్యాసం ఉండేదని, ఇప్పుడు అది తగ్గుతూ వస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ మహిళలు విభిన్న రంగాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి, కళాశాల ఉమెన్స్ సెల్ డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హన్మకొండ అర్బన్: కుటుంబ సంక్షేమం కోసం మహిళలు అహర్నిశలు కృషి చేస్తుంటారని, ఈక్రమంలో వారు తమ ఆరోగ్యంపై కూడా తగిన శ్రద్ధ వహించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో టీజీఓఎస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్ మోహన్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి ఫణికుమార్, సహా అధ్యక్షుడు అనురాధ, నీరజ, హనుమకొండ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాజేష్ కుమార్, మాధవి, శ్రీలక్ష్మి, శ్రీప్రియ, చేతన, హేమలత, కిరణ్మయి, హేమలత, తన్మయి, అరుణ, పవిత్ర, జయంతి, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. మార్గదర్శకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హసన్‌పర్తి: సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి రాజిరెడ్డి అన్నారు. హసన్‌పర్తిలోని బాలిక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తుచేశారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునితారెడ్డి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు పార్థసారథి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ చెక్కుల అందజేత



వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న అడ్తిసభ్యులు ప్రొఫెషనల్ ట్యాక్స్‌కు సంబంధించిన రూ.11,15,000 విలువైన 223 చెక్కులను వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా జీఎస్టీ అధికారులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, సలహాదారు వెల్దిచక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘అకుట్’ ఎన్నికలు



ఓటుహక్కు వినియోగించుకుంటున్న రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కేయూ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో మంగళవారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా 77మంది అధ్యాపకులకు గాను 75మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్.ప్రణయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 5న ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నట్లు వివరించారు. అకుట్ అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పదవికి బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ పోటీ చేశారు. కాగా, అకుట్ ఉపాధ్యక్షురాలుగా ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ రాము, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల నిధులతో కాన్ఫరెన్స్ హాల్

- 9న కేయూలో ప్రారంభోత్సవం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థులు అందించి విరాళాలతో కాన్ఫరెన్స్ హాల్‌గా ఓ గదిని రూపొందించారు. ఈ నెల 9వ తేదీన దాన్ని ప్రారంభించనున్నట్లు విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి సంబంధిత కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గడ్డం కృష్ణ, వడ్లకొండ సత్యనారాయణ, నాగరాజు, పరిశోధకులు కళ్లెపెల్లి ప్రశాంత్, అంకెళ్ల శంకర్, కేతపాక ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు పునరుత్పాదకాలు ఊతం



రమేష్‌కుమార్‌తో ప్రొఫెసర్లు, విద్యార్థులు

- ఆస్ట్రియా శాస్త్రవేత్త రమేష్‌కుమార్

కేయూ క్యాంపస్: ప్రపంచ వ్యాపితంగా ప్రత్యామ్నాయ పునరుత్పాదక ఇంధనాలు, రసాయనాలకు ఉన్న డిమాండ్.. పరిశోధనలకు ఊతమని కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పూర్వ విద్యార్థి, ఆస్ట్రియా దేశ శాస్త్రవేత్త సీహెచ్.రమేష్‌కుమార్ అన్నారు. కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనాల ఉత్పత్తి, శిలాజ ఇంధనాలకు పునరుత్పాదక ద్రవ ఇంధనాలను ప్రత్యామ్నాయ వనరుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనాలపై ఆధారపడాలని సూచించారు. అనంతరం రమేష్‌కుమార్‌ను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ హనుమంతు, ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, ప్రొఫెసర్ జ్యోతి, డాక్టర్ మమత పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మురుగునీరు



నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై పారుతున్న మురుగు

- ఖమ్మం రోడ్డులో డ్రెయినేజీలు లేక ప్రజల అవస్థలు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి తిమ్మాపురం క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఇళ్లల్లోని మురుగునీరు రోడ్డుపై అడ్డదిడ్డంగా పారుతోంది. ఈక్రమంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు గ్రీవెన్ సెల్, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు స్పందించి ఆర్టీఏ జంక్షన్ నుంచి తిమ్మాపురం క్రాస్ వరకు రోడ్డుకు ఇరువైపులా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా

అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభం

ఖిలా వరంగల్: విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ మంచి వరంలాంటిదని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వరుణ్ అన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జెన్, గ్లోబల్ స్టడీ అడ్వైజర్ (యూఎస్ఏ ఆధారిత) సహకారంతో (అబ్రాడ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ –2025) విదేశీ విద్యా ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, టర్కీ, మలేషియా, ఐర్లాండ్, ఫ్రాన్స్, కెనడా, ఇటలీ, స్కాట్లాండ్, జర్మనీతోపాటు 30పైగా విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ కళాశాల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రారెడ్డికి ఘన నివాళి

విద్యారణ్యపురి: ఉస్మానియా ఉద్యమ కెరటం షహీద్ చంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఏబీవీపీ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో, అలాగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి విభాగ్ సంఘటన్ కార్యదర్శి హర్షవర్ధన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆరెపల్లి సుజిత్, బాధ్యులు హరిచరణ్, శ్రీకాంత్, భారత్ పాల్గొన్నారు.

శంభునిగుడి హుండీ లెక్కింపు

ఖిలా వరంగల్: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.1,09,400, అర్చన, అభిషేకాల ద్వారా రూ.96,900 ఆదాయం లభించదని దేవాదాయశాఖ ఈఓ వెంకట్రావు తెలిపారు.

కాశీ విశ్వేశ్వరాలయ హుండీ లెక్కింపు

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ.1,65,190 ఆదాయం వచ్చిందని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోనె జగదీశ్వర్ తెలిపారు. 2024, అక్టోబర్ 24నుంచి 2025, మార్చి 4వ తేదీ వరకు జరిగిన కార్తీక మాసం, మహాశివరాత్రి పండుగలకు ఈ మొత్తం ఆదాయం వచ్చిందని వివరించారు.


కేడీసీలో ఉచిత కంటి పరీక్షల శిబిరం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్), హెల్త్ క్లబ్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కన్ను అతి ముఖ్యమైనదని అన్నారు. వైద్యులు హరికృష్ణ, విజయ్, డాక్టర్ లక్ష్మీనారాయణ రవి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌రావు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ గన్‌సింగ్, హెల్త్ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ రోహిణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయాలి

కాళోజీ సెంటర్: పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్ల వేతనాలను విడుదల చేయాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు రాక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట



నయీంనగర్: బీఆర్ఎస్ హయాంలో మైనార్టీల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీట వేశారని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా 6వ డివిజన్ సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మహిళలకు బీఆర్ఎస్ నాయకుడు అబ్బు ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో సర్వమత సౌభ్రాతృత్వం విలసిల్లుతోందని, మత సామరస్యానికి, పరమత సహనానికి తెలంగాణ నెలవని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నల్లా స్వరూపరాణి, మైనార్టీ నాయకులు ఖుద్దూస్, ఎండీ.బ్రూహాన్, ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల అధ్యక్షతన సీపీఎం విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా నాగయ్య హాజరై మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వర్గాలకు నిధులు కేటాయింపుల్లో కేంద్రం మొండిచేయి చూపిందని ఆరోపించారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రంగయ్య, జిల్లా కమిటీ ప్రతినిధులు ఈసంపెల్లి బాబు, సింగారపు బాబు, కుమారస్వామి, అరూరి కుమార్, నమిండ్ల స్వామి, శ్రీధర్, సాంబయ్య, బషీర్, దుర్గయ్య, ప్రశాంత్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలని ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు సూచించారు. హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మధుసూదన్ రావును తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శౌకుమార్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి, నాయకులు మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఏఓ నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.మహేష్, సంగీత్ కుమార్, ఎం.వేణు, కె.యుగేందర్, జి.ఉపేందర్, పి.ధనలక్ష్మి, బి.వనిత, జె.స్వప్న, చరణ్ కుమార్, రామకృష్ణ, రాజయ్య, దామోదర్, చారి, నవీన్ కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ

వరంగల్: విద్యార్థులు తమ తల్లిదండ్రులు చెప్పినట్లుగా నడుచుకోవాలని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ సూచించారు. ఆరెపల్లి సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల కళాశాల, పాఠశాలలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శనలు ఇచ్చి చదువు ప్రాముఖ్యత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లతో పాటు రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీటీమ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, కళాశాల ప్రిన్సిపాల్ కె.సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు, ఉమెన్ ఏఎస్సై నాగమణి పాల్గొన్నారు.